క్లుప్తంగా

కొండా లక్ష్మణ్ పేరు పెట్టడంపై హర్షం

ఆసిఫాబాద్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి స్వాతంత్య్ర సమర యోధుడు, తెలంగాణ పోరాటయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టడంపై జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని కోరారు. రాష్ట్రంలోని చేనేత రుణాలను మాఫీ చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

కాగజ్‌నగర్‌రూరల్: ప్రజాబంధు దివంగత మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు 25వ వర్ధంతి సందర్భంగా ఆదివారం మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ హరీశ్‌బాబు తెలిపారు. పట్టణంలోని పటేల్ గార్డెన్స్‌లో ఉదయం 9 గంటల నుంచి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాధారణ వైద్యం, శస్త్రచికిత్స, స్త్రీల సంబంధిత, చెవి, ముక్కు, గొంతు, ఎముకలు, కీళ్లు, పిల్లలు, గుండె, కిడ్నీ, మూత్రాశయ, నరాలు, ఉదరకోశ వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. శిబిరంలో అల్ట్రాసౌండ్, సిటీస్కాన్, ఎక్స్‌రే, రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు ఉచిత మెగా వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్యశిబిరానికి స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని భట్‌పల్లి గ్రామపంచాయతీలోని సీబాబు కాలనీలో శనివారం ఎస్పీఎం స్పర్శ ఫౌండేషన్, చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని వైద్యులు భానుప్రకాశ్, మిల్లు ప్రతినిధి తుమ్మ రమేశ్, చేయూత స్వచ్ఛంధ సేవా సంస్థ వ్యవస్థాపకులు వంగరి ప్రవీణ్, స్పర్శ ఫౌండేషన్ ఆర్గనైజర్ రీనాలు ప్రారంభించగా, 200 మందికిపైగా రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీనివాస్, రేఖ, శ్రీవాణి, అయిళ్లవారి సేవా సమితి అధ్యక్షులు అయిళ్ల శంకర్, దుర్గం రవి, నరేశ్, రాజు, పుల్లయ్య, సాయి, తిరుమల్, ప్రశాంత్, శ్రీకాంత్, సత్యనారాయణ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన వీహెచ్‌పీ సభ్యులు

రెబ్బెన: ఇటీవల నూతనంగా ఏర్పడిన రెబ్బెన ఖండ విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, గోసంరక్షక్ కమిటీ సభ్యులు శనివారం రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎస్సైని శాలువాతో సన్మానించారు. ఎస్సై మాట్లాడుతూ గణేశ్ నిమజ్జన వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సహకరించాలని కోరారు. విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు లోకేష్ నాయుడు, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి నరసింహారావు, కోశాధికారి కీర్తి మహేందర్, సహకార్యదర్శులు స్వామి, మ నీష్, భజరంగ్‌దళ్ సంయోజక్ సంజీవ్, స త్సంగ్ ప్రముఖ్ ఘన్ శ్యాం చౌడ, హరీశ్, ని ఖిల్ జైస్వాల్, నవీన్, సాయికృష్ణ పాల్గొన్నారు.

పోచయ్యకు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు

రెబ్బెన: మండల కేంద్రంలోని విశ్వశాంతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ఇప్ప పోచయ్యకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు వరించింది. 25 ఏళ్లుగా ప్రైవేటు పాఠశాలను నిర్వహిస్తూ, విద్యారంగంలో సేవలు అందిస్తున్నందుకు గాను ఆల్ ఇండియా ప్రైవేటు స్కూల్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర చీఫ్ అడ్వైజర్ యాదగిరి శేఖర్‌రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరిల చేతుల మీదుగా శనివారం అవార్డు అందుకున్నారు.

పేకాట ఆడుతున్న నలుగురి అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని కాపువాడ శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై సుధాకర్ తెలిపారు. కాపువాడకు చెందిన షేక్ నాజర్ మహమ్మద్, ఖైరత హుస్సేన్, అశోక్‌కాలనీకి చెందిన మునిగంటి బాబు, భట్‌పల్లి గ్రామానికి చెందిన అంగల అంజయ్యలను పట్టుకుని, వీరి నుంచి రూ.4550 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దాడిలో సిబ్బంది మోహన్, ఆనంద్ కుమార్‌లు పాల్గొన్నారు.

అప్రమత్తతే రక్ష..!

- 9, 11వ రోజుల్లో గణపతి విగ్రహాల నిమజ్జనం
- ఏర్పాట్లలో ఉత్సవ కమిటీలు
- విద్యుత్ వైర్లు, నదుల వద్ద తస్మాత్ జాగ్రత్త



కాగజ్‌నగర్‌లో నిమజ్జన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలు దిగ్విజయంగా కొనసాగుతుండగా.. 9, 11వ రోజుల్లో నిమజ్జనోత్సవాలకు ఉత్సవ కమిటీల నిర్వాహకులు సిద్ధమయ్యారు. ఇప్పటికే జిల్లాలోని కొన్ని గణనాథులను 5, 7వ రోజుల్లో నిమజ్జనం చేయగా, భారీ గణనాథులను 9, 11వ రోజుల్లో చేయనున్నారు. ఊరేగింపు.. సాంస్కృతిక కార్యక్రమాలు.. నృత్యాలు.. నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో 873 విగ్రహాలు..

ఏటా వినాయక విగ్రహాల నిమజ్జనంలో నిర్లక్ష్యం కారణంగా పలువురు మృత్యువాత పడుతున్నారు. దీంతో ఆయా కుటుంబాల్లో పండగ పూట తీరని విషాదం నెలకొంటుంది. ఈ ఏడాది జిల్లాలోని 15 మండలాల పరిధిలో అధికారికంగా 873 వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. వినాయక నవరాత్రుల సందర్భంగా పోలీసులు ముందు నుంచి ప్రణాళిక ప్రకారం సాగుతున్నారు. బ్లూకోట్ సిబ్బంది ట్యాబ్‌లో గణపయ్య మండపం ఫొటో తీసి ఆన్‌లైన్ ద్వారా జియోట్యాగింగ్ చేశారు. నిమజ్జనం ఏరోజు, ఎక్కడ చేస్తారనే వివరాలు పొందుపరిచారు.

నిఘా పటిష్టం..

జిల్లాలో నిర్వహిస్తున్న గణేశ్ ఉత్సవాల కోసం జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవాల నేపథ్యంలో 800 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు జిల్లా వ్యాప్తంగా 1200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గణేశ్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, అసభ్యకరమైన నృత్యాలు చేయడం పూర్తిగా నిషేధించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదు. బాణాసంచాలు కాల్చవద్దని, ఊరేగింపులో కత్తులు, మారణాయుధాలు, మండే పదార్థాలు తీసుకెళ్లవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. గణేశ్ నిమజ్జనం సమయంలో పలు ప్రాంతాల్లో మద్యం షాపులను మూసి వేయనున్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శాంతి సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ నిమజ్జనం సమయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. నిమజ్జనం వేళ ఎలాంటి ఇబ్బందులున్నా డయల్ 100కు సమాచారం అందించాలని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- నిమజ్జనానికి విగ్రహాలను తీసుకెళ్లే ట్రాక్టర్, ఇతర వాహనాలు కండిషన్‌లో ఉన్నవి మాత్రమే వాడాలి.
- శోభాయాత్రకు వినియోగించే ఆటోలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల టైర్లు, బ్రేకులు ముందుగానే ఒకటికి రెండుసార్లు పరీక్షించుకోవాలి.
- అనుభవం, లైసెన్స్ ఉన్న డ్రైవర్లను మాత్రమే నిమజ్జన సమయంలో వాహనాలు నడిపేలా చూడాలి.
- కాలనీల్లో వినాయక శోభాయాత్ర నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరా తీగలను తప్పనిసరిగా గమనించి తగిన జాగ్రత్తలు పాటించాలి.
- ప్రస్తుతం వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నీటితో నిండుగా ఉన్న నేపథ్యంలో చీకటిపడే సమయానికి నిమజ్జనం జరిగేలా చూడాలి.
- చెరువులు, వాగులు, కుంటల దగ్గర నిమజ్జనం రోజున విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి.
- ఎక్కువ లోతుకు వెళ్లకుండా ఈత వచ్చిన వారు మాత్రమే వినాయక విగ్రహాలను నీటిలోకి తీసుకెళ్లి నిమజ్జనం చేయాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



వినాయకచవితి నిమజ్జనం నేపథ్యంలో ఉత్సవ కమిటీలు తగిన జాగ్రత్తలు తీసుకొని ఎలాంటి ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలి. నిమజ్జన వేడుకలను అధికార యంత్రాంగం సూచనలు పాటిస్తూ శాంతియుతంగా జరుపుకోవాలి. ఇప్పటికే నిమజ్జన స్థలాలను అధికారులు పరిశీలించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఏదైన ప్రమాదం జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. డయల్ 100ను సంప్రదించాలి.

– డీవీ శ్రీనివాస రావు, ఎస్పీ

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

కాగజ్‌నగర్‌రూరల్: జాతీయ హిందీ దినోత్సవాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహంలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భరత మాత చిత్రపటానికి పూలమాల వేసి పుష్పార్చన చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ హిందీ ప్రాముఖ్యత వివరించారు. చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హిందీ విభాగ అధిపతి జనార్దన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి

కొనసాగుతున్న కార్మికుల నిరసన

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్‌కేర్ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి చేపట్టిన నిరసన కార్యక్రమాలు శనివారం ఐదవ రోజుకు చేరాయి. నిరసనలో భాగంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిలా అధ్యక్షుడు దివాకర్ మాట్లాడుతూ కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతుందన్నారు. వేతనాల విడుదలకూ కాంట్రాక్టర్, ఆసుపత్రి సూపరింటెంట్‌ను సంప్రదించగా రేపు మాపు అంటూ దాటవేస్తున్నారని వాపోయారు. వేతనాలను చెల్లించని కాంట్రాక్టర్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, మురళి, మమత, హరీశ్, గంగన్న, గుణవంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఆసుపత్రి కార్మికులు

‘అక్రమ అరెస్టులు సరికాదు’

తిర్యాణి: ఇటీవల జరిగిన జైనూర్ ఘటనలో బాధిత కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లకుండా బీజేపీ నాయకులను అరెస్టు చేయడం సరికాదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులు గౌడ్ అన్నారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన బీజేపీ నాయకులను శుక్రవారం రాత్రి అరెస్టు చేసి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శనివారం బీజేపీ నాయకులు పోలీస్‌స్టేషన్ ఆవరణలో విలేకర్లతో మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కాంద్రే విశాల్, సునీల్, కార్యదర్శి బాలకృష్ణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇగురపు సంజీవ్, పార్టీ నాయకులు సార రమేశ్ గౌడ్, పులి వెంకటేశ్, గెడం సుభాశ్, సప్త శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆంజనేయులు గౌడ్ ముందస్తు అరెస్టు

రెబ్బెన: జైనూర్ మండలంలో గిరిజన మహిళపై అత్యాచారం, హత్యాయత్నం జరిగిన ఘటనలో నష్టపోయిన కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తున్నారనే అనుమానంతో శనివారం తెల్లవారుజామున బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. గోలేటి టౌన్‌షిప్ లోని ఆయన నివాసంలో తిర్యాణి ఎస్సై మాధవ్ అదుపులోకి తీసుకొని తొలుత రెబ్బెన పోలీస్‌స్టేషన్‌కు అనంతరం తిర్యాణి స్టేషన్‌కు తరలించారు.

‘చలో హైదరాబాద్’ విజయవంతం చేయాలి

కౌటాల: హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట ఈనెల 23న నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. శనివారం కౌటాలలో భవన నిర్మాణ కార్మికులతో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని, ప్రభుత్వమే బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను కార్మికులకు అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 23న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని కార్మికులు ధర్నా కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు విఠల్, శేఖర్, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

శాంతియుతంగా వినాయక నిమజ్జనం నిర్వహించాలి

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో ఈనెల 17న నిర్వహించే వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని పట్టణ సీఐ శంకరయ్య సూచించారు. శనివారం పట్టణంలోని రాయల్ గార్డెన్స్‌లో గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ డీజేలకు అనుమతులు లేవని, మధ్యాహ్నం 3గంటలకు గణేశ్ శోభాయాత్ర ప్రారంభించాలన్నారు. పెద్దవాగు సమీపంలో గల గాంధారి మైసమ్మ ఆలయం వరకు మాత్రమే ప్రైవేట్ వాహనాలకు అనుమతులు ఇస్తున్నామన్నారు. ట్రాక్టర్లలో చిన్న పిల్లలను తీసుకెళ్లొద్దని సూచించారు. సమావేశంలో ఎస్సై సుధాకర్, రూరల్ ఎస్సై మహేందర్, హిందూ ఉత్సవ సమితి, భజరంగ్‌దళ్ సభ్యులు, గణేశ్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్టణ సీఐ శంకరయ్య

జీఎంకు సన్మానం

రెబ్బెన: ఇటీవల బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.శ్రీనివాస్‌ను శనివారం విశ్వబ్రాహ్మణసంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జీఎంను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణా చారి, ప్రధాన కార్యదర్శి నల్లగొండ సదాశివ్, సంఘం నాయకులు నరసింహచారి, కిషన్‌చారి, వెంకటేశం చారి, రామకృష్ణ, రమేశ్, కృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



జీఎంను సన్మానిస్తున్న నాయకులు

మరమ్మతులు చేపట్టరూ..?



దహెగాం: చెరువు మత్తడి కొట్టుకుపోయి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని కర్జి గ్రామ సమీపంలోని చెరువు మత్తడికి నాలుగేళ్ల క్రితం బుంగ పడింది. మూడేళ్ల క్రితం భారీ వర్షాల వల్ల చెరువులోకి వరద నీరు చేరడంతో మత్తడి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో సాగుకు నీరందడం లేదు. మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని రెండేళ్ల క్రితం నివేదికలు పంపినా ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు. దీంతో ఆయకట్టుకు సాగు నీరు అందని ద్రాక్షగానే మిగిలింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి చెరువు మత్తడికి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు

ఆసిఫాబాద్: గణేశ్ నవరాత్రులు జిల్లా కేంద్రంలో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. పట్టణంలోని ఆలయాలు, వివిధ కాలనీల వద్ద నెలకొల్పిన గణేశ్ మండపాల వద్ద ప్రతిరోజూ మహిళలు మంగళహారతులతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండపాల వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు భజనలు ఆకట్టుకుంటున్నాయి. జిల్లా కేంద్రంలోని వాసవీ గణేశ్ మండలి వద్ద ఆర్యవైశ్య మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులతో పూజలకు తరలి వస్తున్నారు. నవరాత్రుల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయం, బాపూనగర్‌లోని శారదా గణేశ్ మండలి, హడ్కోకాలనీలోని చైతన్య గణేశ్ మండలితో పాటు సిద్ధివినాయక గణేశ్ మండలి వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు శారదా గణేశ్ మండలి వద్ద గణనాథున్ని దర్శించుకున్నారు. ఆయా గణేశ్ మండళ్ల వద్ద మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

కాగజ్‌నగర్‌రూరల్: గణేశ్ నవరాత్రులను పురస్కరించుకొని శనివారం పట్టణం, మండలంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని చింతగూడ గ్రామంలోని శ్రీసాయిరాం గణేశ్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథున్ని మాజీ జెడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు. పట్టణంలోని మెయిన్ మార్కెట్‌లో శ్రీసాయి గణేశ్ మండలి ఆధ్వర్యంలో గణపతి హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్వారకానగర్‌లోని ద్వారక గణేశ్ మండలి ఆధ్వర్యంలో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు చేశారు. కాపువాడలోని భజరంగ్‌దళ్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ దెబ్బటి శ్రీనివాస్ రూప దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కౌటాల: మండలంలోని భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో ఆయా మండపాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరులు మండలంలోని అన్ని గ్రామాల్లో పూజలందుకున్నారు. మండలంలో గణేశుని పాటలతో ఆయా గ్రామాలలోని గణేశ్ మండపాలు మారుమోగుతున్నాయి. గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో గణేశ్ మండపాల వద్ద ఒగ్గు కథలను ప్రదర్శించారు. భక్తులు ఆసక్తిగా తిలకించారు.

అమెరికాలో గణపతి బప్ప..

కౌటాల: అమెరికాలో సైతం భక్తులు గణపతి పూజలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన సిందోర తన కుటుంబంతో అమెరికాలో ఉంటున్నారు. గణేశ్ చవితి సందర్భంగా వారి ఇంట్లో భర్త గోపాలకృష్ణ, కుటుంబ సభ్యులతో కలిసి గణేశుడికి పూజలు చేశారు. కాగా శనివారం నిమజ్జనం చేసినట్లు వారు తెలిపారు. ఏటా తమ ఇంట్లో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, విదేశాల్లో ఉన్న తమ సంప్రదాయాలు, సంస్కృతి తమ పిల్లలకు నేర్పిస్తామని తెలిపారు.



కౌటాల: తలోడిలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు



అమెరికాలో నిమజ్జనానికి వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న భక్తులు



కాగజ్‌నగర్‌రూరల్: కుంకుమార్చన పూజలో పాల్గొన్న మహిళలు



ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలో గణేశ్ మండపంలో నిర్వహిస్తున్న అన్నదానం



కాగజ్‌నగర్‌రూరల్: అన్నదానంలో పాల్గొన్న కోనేరు కృష్ణారావు



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వాసవీ గణేశ్ మండలి వద్ద పూజలు చేస్తున్న మహిళలు

ఒగ్గుకథ ప్రదర్శన

కౌటాల: మండల కేంద్రంలో మిద్దె రాములు కళాబృందం ఆధ్వర్యంలో ఒగ్గుకథ కళా ప్రదర్శన నిర్వహించారు. కౌండిన్య గణేశ్ మండలి ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఎల్లమ్మ తల్లి –రేణుకామాత ఒగ్గు కథ ప్రదర్శన శనివారం ముగిసింది. సిరిసిల్ల రాజన్న జిల్లాకు చెందిన ప్రముఖ ఒగ్గు కథ కళాకారుడు తీగల రాజేశం, గాజర శ్రీనివాస్‌లు ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో భాగంగా ఎల్లమ్మ తల్లి జననం, కల్యాణం, బోనాల పండుగ, పండుగ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రదర్శనకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ప్రదర్శనలో బృందం సభ్యులు తిరుపతి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు